శిథిలం.. ప్రమాదకరం

- ఎన్‌పీకుంట మండలంలో శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ కార్యాలయాల భవనాలు
- పైకప్పు పెచ్చులూడుతుండటంతో ఇబ్బందులు
- బిక్కుబిక్కుమని విధులు నిర్వహిస్తున్న సిబ్బంది
- నూతన భవనాలు నిర్మించాలని కోరుతున్న ప్రజలు

ఎన్‌పీకుంట: మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన ప్రభుత్వ భవనాలు శిథిలావస్థకు చేరాయి. ఇందులో పాఠశాల భవనాలు, పశువైద్యశాల భవనం, అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు ఉన్నాయి. మండల పరిధిలోని వంకమద్ది, దిగువతూపల్లి గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాల భవనం పైకప్పు పెచ్చులూడుతున్నాయి. గోడల్లో చెట్లు మొలిచి నెర్రలు చీలాయి. ఉపాధ్యాయులు బిక్కుబిక్కుమంటూ పిల్లలకు విద్యాబోధన చేస్తున్నారు. వంకమద్ది ప్రాథమిక పాఠశాలలో 19 మంది, దిగువతూపల్లి ప్రాథమిక పాఠశాలలో 17 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. సుమారు నాలుగు దశాబ్దాల క్రితం ఈ పాఠశాలల భవనాలు నిర్మించినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ప్రస్తుతం ఈ భవనాలు దెబ్బతినడంతో ప్రాణాలు పణంగా పెట్టి విద్యను నేర్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

ఉరుస్తున్న పశువైద్యశాల భవనం

మండల కేంద్రంలో ఉన్న పశువైద్యశాల భవనం శిథిలావస్థకు చేరింది. నేడో, రేపో కూలడానికి సిద్ధం అన్నట్లుగా తయారైంది. కొద్దిపాటి వర్షం కురిసినా పశువైద్యశాల భవనం ఉరుస్తుండటంతో మందులు, సామగ్రి తడిసి పోతున్నాయి. వైద్యులు పశువులకు వైద్యం చేయాలన్నా ఇబ్బందిగా మారింది. మండలంలోని 14 పంచాయతీలు ఈ వైద్యశాల పరిధిలోకే వస్తాయి. ఈ 14 పంచాయతీల్లో 3,500 కుటుంబాలకు పైగా సన్నజీవాల రైతులు, 1,500 కుటుంబాలకు పైగా పాడి రైతులు ఉన్నారు. మండల వ్యాప్తంగా అధికంగా పాడి, పశువుల పెంపకం, గొర్రెలు, మేకల పెంపకంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో పశువైద్యం మెరుగుపడాలంటే కనీసం పశువైద్య కేంద్రం అయినా మెరుగైన స్థితిలో ఉండాల్సిన అవసరం ఉంది.


నెర్మెక్కిన దిగువతూపల్లి ప్రాథమిక పాఠశాల గోడలు


కూలడానికి సిద్ధంగా ఉన్న పశువైద్యశాల గోడ (మందులు భద్రపరిచే గది)

పెచ్చులూడుతున్న అంగన్‌వాడీ కేంద్రాలు

అంగన్‌వాడీ కేంద్రాల్లో సరైన వసతులు లేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. చిన్న పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించే ఈ కేంద్రాలు దుర్భరస్థితిలో ఉన్నాయి. మండల వ్యాప్తంగా 63 కేంద్రాలు ఉండగా.. ఇందులో 18 కేంద్రాలకు పక్కా భవనాలు ఉన్నాయి. 21 అద్దె భవనాలు, 24 రెంట్‌ఫ్రీ భవనాలు ఉన్నాయి. వీటిలో తాటిమానుగుంత, పడమరనడిమి పల్లి, ఎన్.జీ.పీ తండా, వెలిచలమల, ఎన్.పీ.కుంట–1 అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు పెచ్చులూడాయి. వంకమద్ది గ్రామంలోని భవనం పూర్తి శిథిలావస్థకు చేరింది. కొన్ని కేంద్రాలకు ప్రహరీ లేక పాములు, విషపురుగులు కేంద్రాల్లోకి వచ్చేస్తున్నాయి. దీంతో సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహించాల్సిన పరిస్థితి దాపురించింది. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ భవనాలపై దృష్టిసారించి తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


తాటిమానుగుంత అంగన్‌వాడీ కేంద్రంలో పెచ్చులూడిన పైకప్పు

ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో..



పశువైద్యశాల భవనం పైకప్పు పెచ్చులూడాయి. నీరు కారుతుండటంతో వర్షాలు పడిన ప్రతి సారీ మందులు, సామగ్రి నిల్వ ఉంచుకోవాలంటే ఇబ్బందిగా మారుతోంది. పశువులకు వైద్యం చేసేందుకు అవస్థలు పడుతున్నాం. గదులు చిన్నవి కావడంతో పాటు గోడలు నెర్రలు చీలాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి. పశువైద్యశాల నూతన భవనం కోసం సోలార్ ప్లాంట్ వారు ఎస్టిమేషన్ వేసుకుని వెళ్లారు. త్వరితగతిన భవన నిర్మాణం చేపడితే బాగుంటుంది. **– బాలానాయక్, పశువైద్యాధికారి**

భవనం మంజూరు చేయాలి



గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ భవనం శిథిలం కావడంతో పాటు పూర్తిగా దెబ్బతింది. అంగన్‌వాడీ కేంద్రానికి చిన్న పిల్లలు వస్తారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున ఆ భవనం ఎప్పుడు కూలుతుందో అని భయం భయంగా ఉంటుంది. శిథిలావస్థకు చేరుకున్న భవనాలను తొలగించాలి. కొత్త భవనాలు మంజూరు చేస్తే బాగుంటుంది. **– నాగేంద్ర, వంకమద్ది**

భూసార పరీక్షలతో రైతులకు మేలు

ఎన్‌పీకుంట: భూసార పరీక్షలు రైతులకు ఎంతో ఉపయోగకరమని ఏడీఏ సత్యనారాయణ, అనంతపురం భూసార పరీక్ష కేంద్రం వ్యవసాయ అధికారి శ్రీనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని గూటిబైలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ నేల దినోత్సవం నిర్వహించారు. వ్యవసాయ అధికారుల ఆధ్వర్యంలో భూసార పరీక్షలు, మట్టి నమూనాల సేకరణ, ఎరువుల వాడకంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులకు ఆదాయం పెరగాలంటే తప్పనిసరిగా పంటల దిగుబడి పెరగాలన్నారు. ప్రస్తుతం రైతులు పంటల దిగుబడి పెంచే క్రమంలో మోతాదుకు మించి ఎరువులు వాడకం వలన భూమి కాలుష్యం అవుతోందన్నారు. భూమిలోని పంటలకు మేలు చేసే సూక్ష్మజీవులు, వానపాముల సంతతి క్రమంగా క్షీణిస్తోందని తెలిపారు. పెరుగుతున్న జనాభాకు తగినట్లుగా పంటల దిగుబడి పెంచాలంటే తప్పనిసరిగా నేలల ఆరోగ్యం కాపాడుకోవాలన్నారు. అనంతరం పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులకు నేలల ఆరోగ్యం కాపాడుకోవడం ఎలా అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు సర్పంచ్ విష్ణుమూర్తి చేతుల మీదుగా జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శాంతమ్మ, ఆత్మా సిబ్బంది మౌనిక, ఆర్బీకే సిబ్బంది సున్ను బాషా పాల్గొన్నారు.


భూసార పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

రసాయనిక ఎరువులతో అనర్థాలు

తనకల్లు: విచక్షణా రహితంగా రసాయనిక ఎరువులను వాడకం వల్ల భూసారం తగ్గిపోతుందని వ్యవసాయాధికారి శ్రీహరినాయక్ అన్నారు. గురువారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో ప్రపంచ నేల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. ప్రతి రైతు నేల సంరక్షణ పద్ధతులను పాటించాలని సూచించారు. రసాయనిక ఎరువుల వాడకాన్ని పూర్తిగా తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకంపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వీఏఏ మహేష్, వీహెచ్‌ఏ భార్గవి, రైతు సంఘం నాయకులు శివన్న, రమణ పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురికి గాయాలు

బత్తలపల్లి: అనంతపురం–కదిరి జాతీయ రహదారిపై మండల పరిధిలోని రాఘవంపల్లి క్రాస్ వద్ద బుధవారం రాత్రి ముందు వెళుతున్న ఆటోను ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. బత్తలపల్లి పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. అనంతపురం నుంచి ధర్మవరం వెళుతున్న ఆటోను తాడిమర్రి మండలం పిన్నదరి గ్రామానికి చెందిన ద్విచక్ర వాహనం వెనుక నుంచి ఢీకొంది. ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న పాతిమాకు, ద్విచక్ర వాహనదారుడు అభిషేక్‌లు తీవ్రంగా గాయపడ్డారు. మరో నలుగురికి స్వల్ప గాయాలు అయ్యాయి. స్థానికులు వెంటనే క్షతగాత్రులను ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వారిని అనంతపురం ఆసుపత్రి తరలించారు. గురువారం ఆటో డ్రైవర్ సులోమాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని సీసీ కొత్తకోట గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి, సుదర్శన్‌రెడ్డి ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా.. గురువారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. ధర్మవరం నుంచి స్వగ్రామమైన సీసీకొత్తకోటకు వీరిద్దరు ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. మార్గమధ్యంలో మూడు బావుల క్రాస్ వద్ద వీరి వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో వీరిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గమనించి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు. రూరల్ పోలీసులు విచారణ చేస్తున్నారు.



చికిత్స పొందుతున్న కృష్ణారెడ్డి, సుదర్శన్ రెడ్డి

వెల్దుర్తి క్రాస్ వద్ద..

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని వెల్దుర్తి క్రాస్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయపడ్డాడు. స్థానికుల వివరాల మేరకు.. కొత్తచెరువు మండలం లింగారెడ్డిపల్లికి చెందిన నరేంద్రకుమార్ ద్విచక్ర వాహనంలో వెళుతుండగా వెల్దుర్తి క్రాస్ వద్ద ద్విచక్ర వాహనాన్ని స్కార్పియో ఢీ కొంది. ప్రమాదంలో గాయపడిన నరేంద్రకుమార్‌ను స్థానికులు ప్రైవేటు వాహనంలో కొత్తచెరువు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అసిస్టెంట్ లేబర్ ఆఫీస్ ఏర్పాటు చేయాలి

ధర్మవరం అర్బన్/బత్తలపల్లి: ధర్మవరంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీస్ ఏర్పాటు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ముక్తం ఈశ్వరయ్య, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, యువ నాయకుడు మణిదీప్ కోరారు. గురువారం అనంతపురానికి విచ్చేసిన కార్మిక శాఖమంత్రి వాసంశెట్టి సుభాష్‌ను భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీస్ ధర్మవరంలో ఉండేదన్నారు. కాని శ్రీ సత్యసాయి జిల్లా ఏర్పడినప్పుడు కొత్తచెరువుకు మార్చారన్నారు. ధర్మవరం రెవెన్యూ డివిజన్‌లో కనగానపల్లి, రామగిరి, బత్తలపల్లి, తాడిమర్రి, ధర్మవరం రూరల్ మండలాల్లో ఉన్న కార్మికులందరికీ అసిస్టెంట్ లేబర్ ఆఫీస్ ధర్మవరంలో ఉండి ఎంతో కార్మికులకు సౌకర్యంగా ఉండేదన్నారు. ప్రస్తుతం కొత్తచెరువులో ఉండటంతో భవన నిర్మాణ కార్మికులందరూ చాలా ఇబ్బందులకు గురవుతున్నామని పేర్కొన్నారు. దాదాపు 30 వేల మంది కార్మికులు ప్రతినిత్యం లేబర్ కార్డు రెన్యూవల్స్, క్లెయిమ్స్ కోసం కొత్తచెరువుకు వెళ్లి రావాలంటే వ్యయప్రయాసాలకు గురవుతున్నారని గుర్తు చేశారు. స్పందించి అసిస్టెంట్ లేబర్ ఆఫీసును కొత్తచెరువు నుంచి ధర్మవరానికి మార్చాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గోగుల శివ, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.


కార్మికశాఖ మంత్రి సుభాష్‌కు వినతిపత్రం అందిస్తున్న ఈశ్వరయ్య

ఉపాధ్యాయుడి మృతి బాధాకరం

పుట్టపర్తి: అన్నమయ్య జిల్లా రాయచోటి కొత్తపల్లి ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఇజాజ్ విద్యార్థుల దాడిలో మృతి చెందడం బాధాకరమని వైఎస్సార్‌టీఏ నాయకులు గురువారం సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. విద్యాలయాల పరిసర ప్రాంతాల్లో పటిష్ట నిఘా ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్‌ఆర్‌టీఏ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఇంద్రప్రసాద్ పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి..

ఓడీచెరువు: రాయచోటి పట్టణంలోని కొత్తపల్లి ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ఇజాజ్ అహమ్మద్ మరణానికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గౌస్ లాజమ్ కోరారు. నైతిక, మానవీయ విలువలను నేర్పే పాఠ్యాంశాలను సిలబస్‌లో చేర్చాలని సూచించారు. ఘటనపై సమగ్ర విచారణ చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎస్‌సీ నరసింహులు, ప్రధాన కార్యదర్శి సోమశేఖర్ నాయక్, నాగరాజు, అతావుల్లా, చంద్రకళ, సీఆర్పీ రిజ్వానా పాల్గొన్నారు.


ఓడీచెరువులో ఉపాధ్యాయుడు ఇజాజ్ మృతికి సంతాపం తెలుపుతున్న ఉపాధ్యాయులు

సంక్షిప్త సమాచారం

శుభకార్యం

నల్లమాడ: బాసంవారిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు దాసరి మాధవరెడ్డి కుమారుడు వివేకానందరెడ్డికి పల్లవితో వివాహం జరిగింది. అలాగే కుటాలపల్లికి చెందిన దాసరి గోవిందరెడ్డి కుమార్తె హేమావతి వివాహం రాగానిపల్లికి చెందిన చిట్టిబాల రామకృష్ణారెడ్డి కుమారుడు మహేంద్రరెడ్డితో జరిగింది. ఆయా వివాహ వేడుకలకు పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తండ్రి, వైఎస్సార్‌సీపీ నేత దుద్దుకుంట వెంకట్రామిరెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో సహకార సంఘం అధ్యక్షుడు ఏ.గంగిరెడ్డి, నాయకులు దుద్దుకుంట వెంకటరెడ్డి, చిట్టిబాల ఆదినారాయణరెడ్డి, మాధవరెడ్డి, చంద్రహాస రెడ్డి, చంద్రశేఖరరెడ్డి, హరినాథరెడ్డి, చిన్న తిరుపాల్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, డి. ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు.

కార్మిక సమస్యలపై పోరాటం

కదిరి అర్బన్: స్థానిక ఆర్టీసీ డిపోలో గురువారం ఏపీపీటీడీ జైభీమ్ అసోసియేషన్ ప్రథమ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులందరికీ మిఠాయిలు పంచిపెట్టారు. కార్మికుల సమస్యలపై అసోసియేషన్ రాజీలేని పోరాటాలు సాగిస్తుందన్నారు. కార్యక్రమంలో జై భీం నాయకులు ఆర్‌జీ నాయక్, శంకర్‌నాయక్, గంగరాజు, గంగాద్రి, తిరుపాల్, గోవిందప్ప, ఉత్తప్ప, స్వామి, వెంకటనర్సు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రం తనిఖీ

చెన్నేకొత్తపల్లి: పాఠశాలలు, బడి బయట ఉన్న కౌమార దశ బాలికల ఆరోగ్యంపై వారికి అవగాహన కల్పించడంతో పాటు ముఖ్యంగా రక్తహీనతపై అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి వైద్య ఆరోగ్యశాఖ టాస్క్‌ఫోర్స్ సభ్యులు పేర్కొన్నారు. మండల పరిధిలోని ముష్టికోవెలలోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని గురువారం టాస్క్‌ఫోర్స్ సభ్యులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందించే వ్యాధి నిరోధక టీకాల నమోదు రికార్డులను పరిశీలించారు. వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని సూచించారు. జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులు కళాధర్, సుబ్బారావు, వైద్యాధికారులు సరిత, రవినాయక్‌లు, పీహెచ్‌ఎన్ పద్మావతి పాల్గొన్నారు.

8న ఆస్తుల పరిరక్షణపై సమావేశం

కదిరి టౌన్: కదిరి మున్సిపాలిటీ, నియోజకవర్గంలో ఆస్తుల పరిరక్షణపై ఈనెల 8వ తేదీన మున్సిపల్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ హాజరవుతారన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, బిల్డర్లు, వివిధ వ్యాపార సంస్థల అధ్యక్షులు, ఉపాధ్యాయులు, న్యాయవాదులు, ఎన్‌జీఓలు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు రావాలని సూచించారు.

హైకోర్టు ఉత్తర్వులను పట్టించుకోరా?

పుట్టపర్తి టౌన్: యానిమేటర్లను విధుల నుంచి అక్రమంగా తొలగించడం తగదు. వారిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం దుర్మార్గమని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ మండిపడ్డారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. హైకోర్టు ఉత్తర్వుల పత్రాలను సంబంధిత అధికారులకు అందజేస్తే వారు తీసుకోవడం లేదన్నారు. అందుకే ఆ పత్రాలను రిజిష్టర్ పోస్టు ద్వారా సంబంధిత అధికారులను పంపుతున్నట్లు వెల్లడించారు. ఎమ్మెల్యే తన అనుచరులను అదుపులో పెట్టుకోవాలన్నారు. చిరుద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తే వారికి అండగా సీఐటీయూ పోరాటం కొనసాగిస్తుందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి పైపల్లి గంగాధర్, ఐకేపీ యానిమేటర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రగ్బీ పోటీల్లో విద్యార్థి ప్రతిభ


భరత్ కుమార్‌తో కళాశాల యాజమాన్యం

పుట్టపర్తి అర్బన్: ఇటీవల జరిగిన రగ్బీ పోటీల్లో సత్తా చాటిన జగరాజుపల్లి వద్దనున్న మంగళకర కళాశాల బీకాం విద్యార్థి భరత్ కుమార్ ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎస్కే యూనివర్సిటీ తరఫున ఎంపికయ్యాడు. గురువారం కళాశాల మేనేజింగ్ ట్రస్టీ సురేష్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ ఆర్యాప్రకాష్, ఏఓ జయచంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ రమేష్‌బాబు, పీడీ శ్రీనివాసులు అధ్యాపకులు విద్యార్థిని అభినందించారు. భరత్‌కుమార్ ఈనెల 16 నుంచి 20 వరకూ పంజాబ్‌లో జరిగే రగ్బీ పోటీల్లో పాల్గొంటాడన్నారు.

9న బహిరంగ వేలం

తాడిమర్రి: చిల్లవారిపల్లి సమీపంలోని కాటికోటేశ్వర క్షేత్రంలో ఈనెల 9న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు గ్రామ కమిటీ సభ్యులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయంలో టెంకాలు, ఆట బొమ్మలు, ప్రసాదం, గాజులు, తలనీలాల సేకరణకు వేలం పాట నిర్వహిస్తామన్నారు. ఒక ఏడాది కాల వ్యవధి ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు రూ.5 వేలు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వేలం పాట పాడి హక్కులు పొందిన వారు మొత్తం డబ్బు చెల్లించి రశీదులు తీసుకోవాలని కోరారు.

8న సాయి ఫ్రూడెంట్ స్కాలర్‌షిప్ టెస్ట్


పోస్టర్లు విడుదల చేస్తున్న సంస్కృతి యాజమాన్యం

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి సమీపంలోని సంస్కృతి విద్యాసంస్థల్లో ఉచితంగా బీటెక్, బీబీఏ విద్యను అందించడానికి సాయి ఫ్రూడెంట్ టెస్ట్ నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను కళాశాల యాజమాన్యం గురువారం విడుదల చేసింది. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ విజయ్‌భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. జర్మనీలోని అనహాట స్టిఫ్టంగ్ ఫౌండేషన్ సహకారంతో సంస్కృతి కళాశాల ఆధ్వర్యంలో సాయి ఫ్రూడెంట్ స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతిభ కనబరిచిన వారికి ఉచిత విద్యను అందించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 8వ తేదీ ఉదయం 8:30 గంటలకు విద్యార్థులు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, ఆధార్ కార్డు జిరాక్సు తీసుకుని రావాలన్నారు. అనంతపురం, హిందూపురం, ధర్మవరం, కదిరి, మడకశిర విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించినట్లు డైరెక్టర్ నాగరాజు పేర్కొన్నారు. వివరాలకు 9100974543, 9100974530, 9100974518 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కర్ణాటక మద్యం పట్టివేత


అక్రమ మద్యం, బైక్‌తో ఎక్సైజ్ అధికారులు

పుట్టపర్తి అర్బన్: అక్రమంగా గ్రామాల్లో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని గురువారం అరెస్టు చేసి, 60 మద్యం ప్యాకెట్లు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఎస్‌ఐ ఉమామనోహర రాజు తెలిపారు. సీఐ నాగరాజు ఆదేశాల మేరకు పుట్టపర్తి మండలం రాచువారిపల్లి వద్ద గురువారం దాడులు చేపట్టినట్లు పేర్కొన్నారు. రాజు అనే వ్యక్తిని అరెస్టు చేసి మద్యం, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఎక్కడైనా అక్రమంగా మద్యం విక్రయిస్తుంటే తమకు సమాచారం అందించాలన్నారు.

పకడ్బందీగా రెవెన్యూ సదస్సులు

తనకల్లు/కదిరి అర్బన్/తలుపుల/తాడిమర్రి/అమడగూరు/నల్లమాడ/బత్తలపల్లి/ధర్మవరం రూరల్/ధర్మవరం అర్బన్: ధర్మవరం రెవెన్యూ డివిజన్‌లో జరిగే రెవెన్యూ సదస్సులను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీఓ మహేష్ తెలిపారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయ సమావేశ భవనంలో గురువారం రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఏడు మండలాల తహసీల్దార్లు, ఆర్‌ఐలు, వీఆర్వోలు, డీటీఎస్‌లు, ఇతర అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మహేష్ మాట్లాడుతూ ధర్మవరం రెవెన్యూ డివిజన్‌లోని ఏడు మండలాల్లో ఈనెల 6వ తేదీ నుంచి జనవరి 8వ తేదీ వరకూ నిర్వహించే రెవెన్యూ సదస్సులను అధికారులు, సిబ్బంది నిర్వహించి విజయవంతం చేయాలని తెలిపారు. అలాగే తనకల్లు, కదిరి తలుపుల, తాడిమర్రి, అమడగూరు, నల్లమాడ, బత్తలపల్లి, ధర్మవరం మండలాల్లో శుక్రవారం నుంచి రెవెన్యూ సదస్సులు జరుగుతాయని తహసీల్దార్లు ఓ ప్రకటనలో తెలిపారు. రెవెన్యూ సదస్సులను మొక్కుబడిగా కాకుండా చిత్తశుద్ధితో నిర్వహించి రెవిన్యూ సమస్యలు పరిష్కరించాలని ఆర్డీఓ వెంకట సన్యాసి శర్మ తహసీల్దార్లకు సూచించారు. సమస్యలకు పారదర్శకంగా పరిష్కారం చూపించాలన్నారు.

ఆధార్ అప్డేట్ సెంటర్ ప్రారంభం


ఆధార్ అప్డేషన్ సెంటర్‌ను ప్రారంభించిన ఆర్డీఓ వెంకట సన్యాసి శర్మ

కదిరి అర్బన్: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం ఆధార్ అప్డేట్ సెంటర్‌ను ఆర్డీఓ వెంకట సన్యాసి శర్మ ప్రారంభించారు. నియోజవర్గ వ్యాప్తంగా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అపార్ నమోదు కోసం ఈ ఆధార్ అప్డేషన్ సెంటర్లను ఏర్పాటు చేసింది ప్రభుత్వం. ఈ సెంటర్ ఈ నెల 5 నుంచి 9వ తేదీవరకు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఆధార్ అప్డేట్ చేసుకోవాల్సిన వారు వారి ఆధార్‌కార్డుతో పాటు బర్త్ సర్టిఫికెట్, తల్లి, లేదా తండ్రి ఆధార్‌కార్డులను తీసుకుని రావాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, తహసీల్దార్ మురళీకృష్ణ, ఎంపీడీఓ పోలప్ప తదితరులు పాల్గొన్నారు.

21న రక్తదాన శిబిరం

కదిరి టౌన్: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఈనెల 21వ తేదీన పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బీఎస్ మక్బూల్ అహ్మద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రక్తదానం చేయువారు లిగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ లింగాల లోకేశ్వర్‌రెడ్డి 9440488002 నంబర్‌కు ఫోన్ చేసి రిజిష్టర్ చేసుకోవాలన్నారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చి రక్తదానం చేయాలని కోరారు.

కష్టపడి చదివితే భవిష్యత్తు

కదిరి అర్బన్: విద్యార్థులు కష్టపడి చదువుకుంటే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని డీఎస్పీ శివనారాయణ స్వామి పేర్కొన్నారు. గురువారం స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో బాలల హక్కుల చట్టాలపై పట్టణ సీఐ నారాయణ రెడ్డితో కలిసి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల దృష్టి అంతా చదువుపైనే ఉండాలన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా చదువును ఆపకూడదన్నారు. సెల్‌ఫోన్, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎవరైనా ఈవ్ టీజింగ్ చేసి ఇబ్బందులు పెడుతుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం పోక్సో చట్టం, డయిల్ 100 నంబర్ ప్రాధాన్యతను తెలియజేశారు. ప్రధానోపాధ్యాయుడు వెంకటాచలం పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

అమడగూరు: మండలంలోని స్టేషన్‌ను గురువారం డీఎస్పీ విజయకుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, పెండింగ్ కేసులపై ఆరా తీశారు. ఇరువర్గాలతో మాట్లాడి లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకునేలా చైతన్య పర్చాలన్నారు. మండలం కర్ణాటక బార్డర్ సరిహద్దులో ఉండటంతో చెక్‌పోస్టులలో ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కర్ణాటక మద్యం సరఫరా కాకూడదని తెలిపారు. రేషన్ బియ్యం ఇతర ప్రాంతాలకు తరలిపోకుండా గట్టి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం పలు గ్రామాల్లో పర్యటించారు. ఎస్‌ఐ వెంకటనారాయణ పాల్గొన్నారు.

'మెప్మా' అధికారులపై చర్యలు తీసుకోండి


మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న సీఐటీయూ నాయకులు

ధర్మవరం: మున్సిపాలిటీలోని మెప్మా అధికారులపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్‌కు సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, కో–కన్వీనర్ అయూబ్‌ఖాన్ వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపాలిటీలోని మెప్మాలో పొదుపు సంఘాలకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి వారిని ఆర్థికంగా బలోపేతం చేయాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. మహిళా సంఘాలను ఆసరాగా చేసుకుని కొంతమంది మెప్మా అధికారులు, మహిళా గ్రూపుల లీడర్లు, నకిలీ మహిళా పొదుపు గ్రూపులను తయారు చేసి బ్యాంకుల్లో కోట్లాది రూపాయల రుణాలు డ్రా చేసుకుంటూ దందాలను కొనసాగిస్తున్నారన్నారు. బ్యాంకు అధికారులు కూడా పరోక్షంగా సహకరిస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి నకిలీ సంఘాలకు మూల కారణమైన అధికారులు, నకిలీ గ్రూపుల లీడర్లపైన చట్టపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.